క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ తనిఖీ



దుగ్గొండి : మండలంలోని ముద్దునూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ లెక్కల అరుంధతి సోమవారం తనిఖీ చేశారు. చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణుల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. పోషకాహారం అందజేతపై అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అనిల్, సిబ్బంది ఉన్నారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కోరబోయిన రమ కుమారస్వామి దంపతుల కుమార్తె సుష్మ గ్రూప్–4 ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఉద్యోగం పొందిన క్రమంలో ఆమెను ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జెట్టబోయిన రాజేందర్, కమల్‌హాసన్, సంకెళ్ల స్వామి, మురళి, జినుకల పెద్ద చంద్రమౌళి, జినుకల చిన్న చంద్రమౌళి, మణిదీప్, స్వామి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



సీత

చెన్నారావుపేట : సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని సీత ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో సీతను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సీత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. జనవరి 1, 2 తేదీల్లో జరగనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సీత పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రమేశ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వంటపాత్రల బహూకరణ



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వంట పాత్రలు బహూకరించారు. అనంతరరం ఆయన మాట్లాడారు. అయ్యప్ప కమిటీ కోరిక మేరకు రూ.25 వేల విలువైన సామగ్రి అందజేశామన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



నల్లబెల్లి : మండల కేంద్రంలోని వృద్ధులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి స్థానిక పరిశోమా ఆలయ నిర్మాణ దాత డాక్టర్ నాగెల్లి సామెల్ సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో క్రిస్మస్ వేడుకలు మరింత ఉత్సాహంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఈపీ ప్రసాద్, పాస్టేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్, కనుకం నవీన్, మనుగొండ భారతి తదితరులు పాల్గొన్నారు.

వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను వినియోగించుకోవాలి

సంగెం : తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న ఖాతాదారులు వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను వినియోగించుకోవాలని స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర అనిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు బ్యాంకు ద్వారా వివిధ రుణాలు తీసుకుని తిరిగి చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఓటీఎస్ లిస్టులో ఉన్న వారికి గతంలో పలుమార్లు సమాచారం అందించినట్లు వివరించారు. ఓటీఎస్‌కు నేటితో గడువు ముగియనున్న క్రమంలో బకాయిదార్లు వెంటనే స్పందించి బాకీ చెల్లించి రుణ విముక్తి పొందాలని కోరారు.

సీఈఐఆర్ పోర్టల్‌తో సత్ఫలితాలు

- 69 ఫిర్యాదులు.. 38 ఫోన్ల గుర్తింపు
- 12 మంది బాధితులకు అప్పగింత

నల్లబెల్లి : ములుగు జిల్లా ఏటూర్‌నాగారం గ్రామానికి చెందిన ప్రత్యూష గత నెల 22న నల్లబెల్లి మండలంలోని రేలకుంటలో సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయగా నల్లబెల్లికి చెందిన వ్యక్తి ఫోన్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆయన నుంచి ఫోన్‌ను రికవరీ చేసి ఈనెల 16న ప్రత్యూషకు పోలీసులు అప్పగించారు.

మండల కేంద్రానికి చెందిన తాజొద్దీన్ ఈనెల 21న సెల్ ఫోన్ పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించగా సీఐఈఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. అతడి ఫోన్‌ను నల్లబెల్లి మండలంలోని రేలకుంటకు చెందిన వ్యక్తి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు వ్యక్తి నుంచి ఫోన్ రికవరీ చేసి బాధితుడికి ఎస్సై గోవర్ధన్ అప్పగించారు. ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. నల్లబెల్లి మండల పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 69 మంది బాధితులు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా వాటిల్లో 38 ఫోన్లను గుర్తించారు. అందులోంచి 12 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

సెల్‌ఫోన్ పోయినా, గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినా దొరకడం కష్టమనే భావన గతంలో ఉండేది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం అంతంత మాత్రమే అన్నది తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రస్తుతం బాధితులు ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఎక్కడుందో గుర్తించి రికవరీ చేయడం సులువుగా మారింది. ఇందుకోసం పోలీసు శాఖ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ రూపొందించింది. సెల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటే సత్ఫలితాలొస్తున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఫిర్యాదులు 69.. గుర్తించిన ఫోన్లు 38

నల్లబెల్లి మండలంలో గతేడాది ఏప్రిల్ 20 నుంచి ఇప్పటివరకు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా బాధితులు ఫోన్ పోగొట్టుకున్నట్లు 69 ఫిర్యాదులు అందగా పోలీసులు కేసులు నమోదు చేశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి 38 ఫోన్లను గుర్తించారు. వీటిలో 12 ఫోన్లు రికవరీ చేసి సంబంధీకులకు అప్పగించారు. ట్రేస్ చేసిన మరో 26 ఫోన్లను బాధితులకు అప్పగించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

పోర్టల్‌లో నమోదు ఇలా..

ఫోన్ పొగొట్టుకున్న, చోరీకి గురైనా బాధితులు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఫోన్ పోగొట్టుకున్నట్లు లేదా చోరీకి గురైనట్లు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా మీ సేవ ద్వారా దరఖాస్తు చేయాలి. అలాగే పాత నంబర్‌తో సిమ్ కార్డు తీసుకోవాలి. దీంతో ఫోన్‌లోని సిమ్ కార్డు ఆటోమెటిక్‌గా బ్లాక్ అవుతుంది. అనంతరం సీఈఐఆర్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్ నంబర్, ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్, బిల్లు, ఆధార్ కార్డు సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది ఆ ఫోన్‌ను బ్లాక్ చేస్తారు. సదరు ఫోన్‌ను ఎవరు వినియోగిస్తారో గుర్తించేందుకు నిఘా పెడతారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సమాచారం సేకరించి దొరికిన, దొంగిలించిన వ్యక్తి నుంచి ఫోన్‌ను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు. ఫోన్ చేతికొచ్చాక ఐడీ నంబర్ ద్వారా అన్‌బ్లాక్ చేసుకొని ఫోన్ వినియోగించవచ్చు.



ప్రత్యూషకు ఫోన్ ఇస్తున్న ఎస్సై గోవర్ధన్ (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం



సీఈఐఆర్ పోర్టల్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరికితే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలి. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయొద్దు. ఫోన్ పొగొట్టుకున్న, చోరీ చేసిన వ్యక్తి సదరు ఫోన్లతో నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్లను సులభంగా రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తాం.

– కిరణ్‌కుమార్, ఏసీపీ, నర్సంపేట

యువత అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

- నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట రూరల్ : యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి ఆకాంక్షించారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కళాశాలల స్థాయిలోనే భవిష్యత్‌పై ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ ఆసక్తి పెంచుకుని ప్రతిభ చాటాలని చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆన్‌లైన్ నేరాలు, సైబర్ మోసాలు, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో పోలీసులకు యువత సమాచారం అందించి సహకరించాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- సీఐ శ్రీనివాసరాజు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్

వర్ధన్నపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం సిద్ధిస్తుందని స్థానిక సీఐ శ్రీనివాసరాజు, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా తెలిపారు. పట్టణంలో వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాలకు చెందిన బాలబాలికలకు ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి అండర్–16 కబడ్డీ పోటీలను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. బాలబాలికలు విద్యార్థి దశలోనే క్రీడల్లో ఆసక్తి పెంచుకుని సాధన చేయాలని సూచించారు. క్రీడలు స్నేహభావాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తే బంగారు భవిష్యత్‌కు అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు హసనొద్దీన్, జోనల్ స్థాయి కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు షాబీర్ అలీ, కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, సమ్మెట శ్రీనివాస్, రవీందర్, శ్రీధర్, అన్వర్, రాజు, శివ, రాజురెడ్డి, అమ్జద్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఖాయం



పర్వతగిరి : సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాస్



చెన్నారావుపేట : సర్వే పరిశీలిస్తున్న నాయకులు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండలంలోని చెరువుకొమ్ము తండాలో సోమవారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శితో కలిసి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులకు లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు, అక్రమార్కులు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ చెరువుకొమ్ము తండా కమిటీ అధ్యక్షుడు భాస్‌సింగ్, నాయకులు రాజునాయక్, వీరన్న, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నంబర్ వన్ కాలనీలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్ ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారి రాజ్‌కుమార్, సీసీ కట్టయ్య, కారోబార్ సురేశ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య, నాయకులు కమలమ్మ, కందిక సునిల్‌కుమార్, కొనకటి రమేశ్, టేకుల కుమారస్వామి, ఆకులపెల్లి అజయ్, జంగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత



నెక్కొండ : పౌర హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి అభివర్ణించారు. మండలంలోని సీతారాపురంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. సమాజంలోని పౌరులందరికి జీవించే హక్కు ఉందన్నారు. పౌరుల హక్కులను పరిరక్షించాలని సూచించారు. ప్రజలందరూ పౌర హక్కులపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, సీసీ శారద, అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు లబ్ధి

- టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్

నర్సంపేట : సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ తెలిపారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన లక్ష్మణాచారికి, 19వ వార్డులో కొలువుల రాంబాబు కుటుంబానికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన సోమవారం అందజేసి మాట్లాడారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను టీపీసీసీ సభ్యుడు రామానంద్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, నాయకులు బిట్ల మనోహర్, కొల్లూరి రాజు, వార్డు యూత్ అధ్యక్షులు కొండి రాజేశ్, పైండ్ల పవన్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రామానంద్, నాయకులు

ప్రణాళికలతో లక్ష్యసాధనకు బాటలు

- కెరీర్ గైడెన్స్ నిపుణురాలు వేలాంగని

చెన్నారావుపేట : ప్రణాళికలు రూపొందించుకుంటే లక్ష్యసాధనకు బాటలు పడతాయని కెరీర్ గైడెన్స్ నిపుణురాలు వేలాంగని తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు పిన్నింటి బాలాజీరావు, సైకాలజిస్టులు వెలాంగని, రవి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలాంగని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఉపయోగపడే కోర్సులు, పరీక్షల ప్రాముఖ్యత, లక్ష్యసాధనకు అవసరమైన మానసిక సమతుల్యతపై వివరించారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు సంతోశ్‌కుమార్, సీహెచ్ మాధవి, కె మాధవి, వర్దెల్లి సతీశ్‌కుమార్, రమాదేవి, హంస రామకృష్ణ, జాహెద్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వేలాంగని

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నెక్కొండ : న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలను ఎస్సై మహేందర్ కోరారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై కేక్ కట్ చేయొద్దని, డీజేలు పెట్టొద్దని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మద్యం మత్తులో రోడ్ల మీద తిరగొద్దని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీలుంటాయని వివరించారు. ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్, తదితరాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. వాహన ధృవపత్రాలు లేకున్నా, ట్రిపుల్ డ్రైవింగ్ చేసినా, మైనర్లకు వాహనం ఇచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎన్‌ఆర్‌ఐ తోడ్పాటు అభినందనీయం

- హెచ్‌ఎం అనిల్, ఏఏపీసీ ప్రెసిడెంట్ బాయమ్మ

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎన్‌ఆర్‌ఐ అల్లంనేని పూర్ణచందర్‌రావు ఆర్థిక తోడ్పాటు అందించడం అభినందనీయమని హెచ్‌ఎం రంగ అనిల్, ఏఏపీసీ అధ్యక్షురాలు దుబాసి బాయమ్మ అన్నారు. స్కూల్ ఆవరణలో ఆకతాయిలు సాయంత్రం వేళ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాలకు పూర్ణచందర్‌రావు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతరత్రా సదుపాయాల కోసం లక్ష రూపాయల విరాళం అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పూర్ణచందర్‌రావు అందించిన డబ్బుతో స్కూల్‌లో ఏర్పాటు చేసిన 6 సీసీ కెమెరాలను పూర్ణచందర్‌రావు తండ్రి మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. అలాగే ఎన్‌సీసీ కేడెట్లకు పరికరాలు, ఆట వస్తువులను మోహన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనిల్, ఏఏపీసీ అధ్యక్షురాలు బాయమ్మ మాట్లాడారు. పూర్ణచందర్‌రావు, మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ సురేందర్, యాంసాని శ్రీధర్, ఎన్‌సీసీ కమాండెంట్ మనుజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బరిగల దేవయ్య, మదన్‌మోహన్, కుమారస్వామి, అశోక్, పీఈటీ కుమారస్వామి, కళ్యాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మోహన్‌రావు

మహిళల సమస్యల పరిష్కారమే ధ్యేయం

సంగెం : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మహిళా సహాయత కమిటీలు పని చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఇందిర కోరారు. మండల కేంద్రంలో మహిళా సహాయత కమిటీ సభ్యులకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదుగుతున్నారని చెప్పారు. సమాజంలోని వివక్షను అధిగమిస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో మహిళలకు సేవలు అందించడంతోపాటు గృహహింస, ఇతర సమస్యలతో సతమతమవుతున్న వారికి సత్వరమే న్యాయం అందించే దిశగా సంస్థ పని చేస్తోందని తెలిపారు. సమాజంలో చట్టపరమైన హక్కులు సాధించినప్పుడే మహిళలు సమగ్రాభివృద్ధి సాధించగలరని తేటతెల్లం చేశారు. కార్యక్రమంలో సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్ శోభారాణి, సహాయత కమిటీ సభ్యులు రాధిక, సంధ్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

నివాళి

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన చిలువేరు ఎల్లయ్య (90) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్, మాజీ ఎంపీటీసీ ధోని కమలమ్మ, నాయకులు నారాయణరెడ్డి, కందిక సునీల్‌కుమార్, కన్నం ప్రభాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రగూడెంలో..

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో పిండి మానస మృతదేహానికి యాదవ సంఘం నర్సంపేట డివిజన్ కార్యదర్శి గాదం స్వప్న పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని స్వప్న పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు లెంకాల మల్లయ్య, శ్రీను, నానబోయిన రమేశ్, కన్నెబోయిన దిలీప్, బైకాని శివకోటి, శివాజీ, అనిశెట్టి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి



సోము (ఫైల్)

వర్ధన్నపేట : ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని భవానీకుంట తండాకు చెందిన నూనావత్ సోము(40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం వర్ధన్నపేటకు వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో అంబేడ్కర్ సెంటర్‌లో తాళ్లకుంట తండాకు చెందిన వాంకుడోతు సురేశ్ నడుపుతున్న ట్రాక్టర్ ఎక్కాడు. కాగా కొద్ది దూరం వెళ్లగానే రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా సోము ట్రాక్టర్ పై నుండి కింద పడిపోయాడు. ట్రాక్టర్ వెనుక టైర్ సోము మీది నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు సోమును ప్రైవేట్ ఆస్పత్రికి, తదనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. నూనావత్ సోము చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ వాంకుడోతు సురేశ్ నిర్లక్ష్యం, తొందరపాటు వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ మృతుడి భార్య నూనావత్ రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచకూట మహాదేవస్వామి ఆలయంలో అన్నపూజ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్విత పంచకూట పార్వతీదేవిసమేత మహాదేవస్వామి ఆలయంలో సోమవారం సోమావతి అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు రవీందర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అన్నపూజ చేశారు. ప్రత్యేక అలంకరణ చేశారు.భక్తులు లలిత సహస్రనామపారాయణం, భజనలు చేశారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్ : దశాబ్ద కాలంగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలకు పట్టాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ మండల కమిటీ సభ్యుడు ధర్మారపు సాంబమూర్తి ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 6వేల మంది గుడిసెవాసులు ఉన్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చుక్క ప్రశాంత్, ఉదయ్, భవాని, మల్లన్న, సమీనా, ప్రకాశ్, భాగ్యశ్రీ, ప్రభాకర్, కవిత, అబ్బాస్, స్వరూప, శంకర్, వేణు, మంజుల పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖిలా వరంగల్ : జనవరి 5న మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంలో జరగనున్న ఏఐసీటీయూ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఖిలా వరంగల్ సమీపంలోని తూర్పు కోటలో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రతాప్, జగదీశ్వర్ మాట్లాడారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టినేని సూరయ్య, నాగేష్, మల్లికార్జున్, నర్సయ్య, ఐలయ్య, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సంక్షేమానికి సంఘాల దోహదం

ఖిలా వరంగల్ : సభ్యుల సంక్షేమానికి పరపతి సంఘాలు దోహదపడతాయని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే సంఘాలు మరింత బలపేతం అవుతాయని కరీమాబాద్ మున్నూరు కాపు పరపతి సంఘం గౌరవ అధ్యక్షుడు కోల కుమారస్వామి, అధ్యక్షుడు చింతపట్ల మురళి తెలిపారు. వరంగల్‌లోని 39వ డివిజన్ పరిధిలోని కరీమాబాద్ ప్రాంతంలోని లక్ష్మీనగర్‌లో సంఘ ప్రధాన కార్యదర్శి దద్దనాల రమేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మున్నూరుకాపు పరపతి సంఘం 10వ మహాసభకు ముఖ్యఅతిథులుగా కుమారస్వామి, మురళి హాజరై మాట్లాడారు. సంఘంలోని సభ్యులందరికీ వ్యక్తిగత ఆరోగ్య భద్రతతోపాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం సంఘ కోశాధికారి నేల్ల రాజు సంఘ వార్షిక ఆదాయ, వ్యయాలను సభ్యుల ముందు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, రాజేష్, రవికుమార్, హరికృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.